క్లుప్తంగా

విశ్వకర్మ మహోత్సవంలో పలమనేరు నాయకులు



పలమనేరు: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి మహోత్సవాలు నిర్వహించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకురాలు పవిత్ర, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విశ్వకర్మ ప్రజల సంక్షేమం కోసం చేసిన కృషిని వివరించారు.

ఎంపీడీవోగా చంద్రశేఖర్‌రెడ్డి



బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె ఎంపీడీవోగా చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో రాజేంద్రబాలాజీ పలమనేరు డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. కడప జిల్లా వీరమనాయనిపల్లె మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. మండల అభివృద్ధికి కృషి చేస్తానని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఈఎస్‌ఐ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోండి

కుప్పం: ఈఎస్‌ఐ ఆస్పత్రి ద్వారా కార్మికులకు అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్‌ఐ ఆస్పత్రి ఆర్‌ఎంవో శ్యామ్‌బాబు తెలిపారు. కుప్పం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈఎస్‌ఐ కింద కార్మికులకు అనేక సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. వైద్యులు బాలాజి, చందన, నాగేంద్ర, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీఎస్సీపై హైకోర్టు తీర్పు హర్షణీయం

పలమనేరు: ఇటీవల నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియపై హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని యూటీఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు సోమచంద్రారెడ్డి తెలిపారు. గతంలో డీఎస్సీ ఫలితాలు ప్రకటించి ధ్రువీకరణ పత్రాల పరిశీలన సమయంలో ఏ పోస్టు ఎంపిక చేసుకుంటారో దాన్ని కేటాయించేవారని తెలిపారు. ఇప్పుడు అందుకు భిన్నంగా దరఖాస్తులోని ప్రాధాన్యత క్రమాన్ని తీసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. టీచర్ల ప్రమోషన్‌లోనూ రెండు సబ్జెక్టులకు అర్హత కలిగి ఉంటే దరఖాస్తుల పరిశీలనలో వారి ఆప్షన్ అడుగుతారని పేర్కొన్నారు. ఈ డీఎస్సీలో నిబంధనలు ఏమాత్రం పాటించలేదని తెలిపారు. కోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవించి అమలు చేయాలని కోరారు.

కూటమి మోసాలను జనానికి వివరించాలి



ప్రజలకు క్యూఆర్‌కోడ్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పలమనేరు: కూటమి ప్రభుత్వం పథకాల అమలుపేరుతో చేస్తున్న మోసాలను ప్రజలు అర్థం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ పలమనేరు మండల కన్వీనర్ బాలాజీనాయుడు తెలిపారు. ఆయన బుధవారం బయ్యప్పగారిపల్లి పంచాయతీ కరణంవారికుంటలో బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంపిణీ చేసి చంద్రబాబు ఇచ్చిన హామీలు, చేస్తున్న మోసాలను వివరించారు. కార్యక్రమంలో గోవిందనాయుడు, వెంకటేష్, ఆనంద్, కన్నయ్య, మందడి, హరీష్, బాలాజీ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

కుప్పం రూరల్: తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చే బాధ్యత పిల్లలదేనని కుప్పం డీఎస్పీ పార్థసారథి, సీఐ శంకరయ్య తెలిపారు. కుప్పం వైసీజేమ్స్ ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పిల్లలు మత్తుకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మాదకద్రవ్యాల జోలికి వెళ్లబోమని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ప్రిన్సిపాల్ జగన్నాథరావు, అధ్యాపకులు రామక్రిష్ణ, బాబూజి నాయక్, ఇమాన్యుయేల్, మాణిక్యం, హుస్సేన్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాలు ప్రారంభం

పలమనేరు: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం రాష్ట్రీయ ఎనిమిదో పోషణ మాసోత్సవాలను ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రాజెక్టులోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో అక్టోబరు 16 వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు జరిగింది. దీనివల్ల కలిగే ప్రయోజనాలను జిల్లాపరిశ్రమల శాఖ జీఎం సూరిబాబు వివరించారు. ఐపీవో రామాంజినేయులు రెడ్డి, సచివాలయ కార్యదర్శులు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

ప్రవహిస్తున్న వరదనీరు, చౌడేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వర్షపునీటిలో విద్యార్థులు







చౌడేపల్లె, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపిలేని వర్షం కురిసింది. చెరువులు, వాగులు, వంకలు ప్రవహిస్తున్నారు. చౌడేపల్లె మండలంలో 52 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని పేర్కొన్నారు. వరద నీరు పొలాల్లో ప్రవహించడంతో వరి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. చౌడేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలోకి అడుగు మేర వర్షపు నీరు చేరింది. నీటిలో సిబ్బంది పనిచేయాల్సి వచ్చింది.

నీట మునిగిన పంటలు

- చౌడేపల్లెలో జూనియర్ కళాశాలలోకి చేరిన వర్షపు నీరు
- పులిచెర్లలో నిండిన చెరువులు
- రొంపిచెర్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పలేరు

చౌడేపల్లె: భారీ వర్షానికి చౌడేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలోకి అడుగు మేర నీరు చేరింది. తరగతి గదుల్లోకి సైతం వర్షపు నీరు చేరడంతో పుస్తకాలు, విలువైన రికార్డులు తడిసిపోయాయి. బుధవారం ఉదయం కళాశాలకు వచ్చిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రిన్సిపాల్ జయరామయ్య, అధ్యాపకులు బాలాజి, సుబ్రమణ్యం విద్యుత్ సరఫరాను తొలగించారు. తరగతి గదుల్లో తడిసిన వస్తువులను పై అంతస్తులోకి మార్చారు. అనంతరం విద్యార్థులకు పై అంతస్తులోనే పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో షబ్బీర్ అహమ్మద్, తహసీల్దార్ పార్వతిని కలిసి వినతి పత్రం అందజేశారు. పంట కాలువలను కొంతమంది ఆక్రమించుకోవడం వల్లే నీరు కళాశాలలోకి వచ్చిందని, కాలువలను పునరుద్ధరించి వర్షపు నీరు రాకుండా చూడాలని కోరారు. పంచాయతీ కార్మికులు అక్కడికి చేరుకుని వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.



వర్షానికి వరి కయ్యలనుంచి తెగి పొంగిపోర్లుతున్న వరదనీరు



రొంపిచెర్ల : ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పలేరు

ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పలేరు

రొంపిచెర్ల: తలకోన అటవీ ప్రాంతం నుంచి వచ్చే కప్పలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నీరు రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీలోని ఏటిచెరువులోకి చేరుతోంది. బుధవారం రాత్రికి చెరువు మొరవ పోయే అవకాశం ఉందని రైతులు తెలిపారు. అలాగే మల్లెలమిట్ట ప్రాజెక్టులోకి 90 శాతం నీరు వచ్చిందని పేర్కొన్నారు.

నిండిన చెరువులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల పంటలు నీట మునిగాయి. ముఖ్యంగా కూరగాయలు సాగు చేసిన పొలాల్లో అడుగు మేర నీరు నిలిచింది. దీంతో కాయలు కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. చేతికి వచ్చిన వరిపంట నీట మునగడంతో తీవ్రంగా నష్ట పోయినట్టు చెబుతున్నారు. కుమ్మరపల్లె వద్ద టమాటా, అందులోని అంతర పంటగా సాగుచేసిన బీర పంట పూర్తిగా నీట మునిగింది.



పులిచెర్ల(కల్లూరు) : మొరవపోతున్న పాళెం పంచాయతీలోని ఎర్ర చెరువు



కుమ్మరిపల్లె వద్ద నీట మునిగిన టమాటా, బీర పంటలు

మనుషులు చచ్చిపోయాక 108 వస్తుందా..?

- ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాలని బోర్డు పెట్టండి
- జెడ్పీటీసీ దామోదరరాజు ఆగ్రహం
- వాడీవేడిగా మండల సమావేశం

చౌడేపల్లె: మండలంలో 108 వాహన సేవలు అధ్వానంగా మారాయని, మనిషి చచ్చిపోయాక గాని 108 వాహనం వచ్చేలా లేదని జెడ్పీటీసీ ఎస్.దామోదరరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రామ్మూర్తి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలో నెలరోజుల్లో రెండు చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకెళితే డాక్టర్లు లేరని మండిపడ్డారు. మండలంలోని 108 వాహనం నెలరోజుల క్రితం మరమ్మతులకు గురైతే ఏమి చేస్తున్నారంటూ డాక్టర్ మోనాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రుల్లో డాక్టర్లు ఉండరు, 108 వాహనం అందుబాటులో ఉండదని ఆరోపించారు. అలాంటప్పుడు 'మేము విధుల్లో వుండము.. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లండి' అని బోర్డు పెట్టాలని మండిపడ్డారు. మండలంలో రెండు రోజులుగా అండర్-14, 17 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై ఎంఈవో కేశవరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోపాలమిత్రలు రైతుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని కొండామర్రి సర్పంచ్ జయసుధమ్మ నిలదీశారు. రైతులకు సరిపడా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని ఏవో మోహన్‌కుమార్‌ను కోరారు. కొందరు డీలర్లు కేజీ 2 కేజీల రాళ్లు పెట్టి తూకం తగ్గించి ఇస్తున్నారని తహసీల్దార్ పార్వతి దృష్టికి తెచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సర్పంచుల సంఘ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కోఆప్షన్ మెంబరు సాధిక్ బాషా, ఎంపీడీవో షబ్బీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ తదితరులు



చీలంపల్లె వద్ద జాతీయ రహదారిపై బైఠాయించిన మహిళలు

తాగునీరు ఇవ్వాలని ధర్నా

బైరెడ్డిపల్లె: మండల కేంద్రమైన బైరెడ్డిపల్లె పంచాయితీలోని చీలంపల్లెలో వారం రోజులుగా తాగునీటి సమస్య నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు బుధవారం ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు 250 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. రెండు బోర్లలో నీరు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నారు. బోరు మోటార్లు మరమ్మతులకు గురికావడంతో సమస్య తలెత్తిందన్నారు. అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని వాపోయారు. విషయం తెలుసుకున్న బైరెడ్డిపల్లె పోలీసులు అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

మెడికల్ కళాశాలలు ప్రయివేట్‌కు ఇవ్వడం దారుణం

- జగన్ చేసిన మంచిని చంద్రబాబు చెరిపేస్తున్నారు
- మాజీ ఎంపీ చింతామోహన్

కుప్పం: గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యావ్యవస్థకు ప్రాధాన్యం ఇచ్చి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారని, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని ప్రవేట్ పరం చేయాలనుకోవడం దారుణమని మాజీ ఎంపీ చింతా మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం కుప్పం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎంతో వ్యవప్రయాసలకు ఓర్చి 17 మెడికల్ కళాశాలలను పూర్తి చేసిందని, వాటిని చంద్రబాబు ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడం చేతగాని తనమన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని చంద్రబాబు చెరిపేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేతకాని తనంవల్లే రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందని దుయ్యబట్టారు. సమీవుల్లా, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతామోహన్

రీసర్వేతో భూ సమస్యలకు చెక్

పెద్దపంజాణి: భూముల రీసర్వేతో సమస్యలకు పూర్తి పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ హనుమంతు తెలిపారు. మండలంలోని రాయలపేటలో బుధవారం భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో రీసర్వే చేసే విషయాన్ని తమ సిబ్బంది ముందుగా రైతులకు తెలియజేస్తారని చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకం, లేటెస్టు 1బి, మూడు ఫొటోలు, బ్యాంకు పాసు పుస్తకం, సెల్ నంబరు, ఆధార్ కార్డు జిరాక్సు కాపీలను సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ డీటీ యోగేష్, ఆర్ఐ రాకేష్ కుమార్, పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంలో గ్రామ కమిటీలు కీలకం



పుంగనూరు : మాట్లాడుతున్న వజ్ర భాస్కర్‌రెడ్డి



చౌడేపల్లె : మాట్లాడుతున్న నాగభూషణరెడ్డి

పులిచెర్ల(కల్లూరు)/పుంగనూరు: పార్టీ బలోపేతంలో గ్రామ కమిటీలు కీలకమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి (యాక్టివిటీ) వజ్ర భాస్కర్‌రెడ్డి ఆయన బుధవారం పులిచెర్ల, పుంగనూరు మండలాలు, పుంగనూరు మున్సిపాలిటీ లో గ్రామ కమిటీల సభ్యులతో సమావేశమయ్యా రు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. విద్యాధికులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ యువత, మహిళలను గుర్తించి కమిటీల్లో నియమించాలన్నారు. కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పులిచెర్లలో జరిగిన కార్యక్రమంలో టీటీడీ మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, హేమసుందరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పుంగనూరులో** ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, పార్టీ జిల్లా కార్యదర్శి దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్, కౌన్సిలర్లు పూలత్యాగరాజు, కిజర్‌ఖాన్ , ఇంతియాజ్‌ఖాన్, రాష్ట్ర కార్యదర్శి అనీషారెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహులు, బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, రాజారెడ్డి, రామమోహన్‌రెడ్డి, రమణ, బాబు, షాజహాన్, నూర్, సీతారామయ్య పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

చౌడేపల్లె: వైఎస్సార్ సీపీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపునిస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పరికిదొన, శెట్టిపేట, పుదిపట్ల, దిగువపల్లె, గడ్డంవారిపల్లె పంచాయతీల్లో అనుబంధ కమిటీల ఏర్పాటుపై సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామ కమిటీలు కీలకమన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసి చైతన్యం తీసుకురావాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, వెంకటరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, సర్పంచ్ లక్ష్మిదేవి, ఎంపీటీసీ శ్రీరాములు, కోఆప్షన్ మెంబరు సాధిక్ బాషా, షంషీర్, బ్రహ్మానందరెడ్డి, కృష్ణప్ప, బాబు, భాస్కర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు తిప్పలు తప్పడం లేదు

వి.కోట: కూటమి ప్రభుత్వంలో రైతులకు తిప్పలు తప్పడం లేదని ఎంపీపీ యువరాజు ఆరోపించారు. ఆయన బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి చింతమాకులపల్లి పంచాయతీలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ కరపత్రాలు అందజేసి పథకాల అమలులో చంద్రబాబు చేస్తున్న మోసాన్ని వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలు అందేవని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని రంగాలను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గోపిరెడ్డి, సర్పంచ్ రామచంద్రప్ప, నాయకులు జగన్నాథ్ రెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేష్, నారాయణప్ప, నాగరాజు, రమేష్, సురేంద్ర, మంజునాథ్, ఆనంద్ పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

పెట్రోల్ బంక్‌లో ఘరానా మోసం



రోడ్డుపై ధర్నా చేస్తున్న బాధితులు

గంగవరం: మండలంలోని పలమనేరు - మదనపల్లి జాతీయ రహదారిలోని అప్పినపల్లి క్రాస్ వద్ద పెట్రోల్ బంక్‌లో జరుగుతున్న ఘరానా మోసం బుధవారం వెలుగు చూసింది. చిన్నమనాయనిపల్లికి చెందిన చంద్ర తన బైక్‌లో రూ.500కు పెట్రోల్ పట్టుకున్నాడు. అనుమానంతో ట్యాంక్ నుంచి బాటిల్‌లో పట్టుకున్నాడు. అందులో 2 లీటర్లు మాత్రమే వచ్చింది. అవాక్కైన అతడు ఇదేమిటని ప్రశ్నించడంతో సిబ్బంది అసభ్య పదజాలంతో దూషించి దిక్కున్న చోట చెప్పుకో అంటూ బెదిరింపులకు దిగారని బాధితుడు వాపోయాడు. దీంతో అతడు గ్రామస్తులతో కలిసి పెట్రోల్ బంక్ ఎదురుగా ధర్నాకు దిగాడు. చాలా సేపు వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. అక్కడి నుంచి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పులిచెర్ల(కల్లూరు): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వాణి శ్రీదేవి తెలిపారు. ఆమె బుధవారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా 106 రామిరెడ్డిగారిపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ పిల్లల్లో స్థూల కాయం నివారణకు చక్కెర, నూనెల వాడకం తగ్గించాలన్నారు. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భాష్యం పాఠశాలను సీజ్ చేయాలని ధర్నా

పుంగనూరు: పట్టణంలోని భాష్యం పాఠశాలను సీజ్ చేసి ప్రిన్సిపాల్, టీచర్‌ను అరెస్ట్ చేయాలని సీమాంధ్ర విద్యార్థుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వై.విజయభాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. వారు బుధవారం రాత్రి ఎమ్మార్వో వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 10న ఆరో తరగతి విద్యార్థిని నాగశ్రీ హోమ్ వర్క్ రాయలేదని ఉపాధ్యాయుడు తల పగులకొట్టాడని తెలిపారు. బాలిక పరిస్థితి విషమంగా ఉందన్నారు. దీనిపై పాఠశాల యాజమాన్యం స్పందించిక పోవడం బాధాకరమన్నారు.

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

పుంగనూరు: సోమల మండలంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపినట్టు ఎంఈవో తెలిపారు. 200 మీటర్ల పరుగు పందెంలో నంజంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.దీక్షిత, డిస్కత్రోలో టి.నిఖిత ప్రథమ స్థానంలో నిలిచారు. టి.జశ్వంత్ రెండో స్థానం, పి.రేవంత్ మూడో స్థానం, ఏ.గణేష్ నాలుగోస్థానంలో నిలిచారని పేర్కొన్నారు.

నేడు యూరియా పంపిణీ

పుంగనూరు: మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల్లో గురువారం యూరియా పంపిణీ చేయనున్నట్టు ఏవో రాధ తెలిపారు. మండలానికి రెండో విడతలో 2,374 బస్తాల యూరియా వచ్చిందన్నారు. అవసరమైన రైతులు తమ పొలాలకు సంబంధించిన రికార్డులు తీసుకుని, బయోమెట్రిక్ వేసి యూరియాను తీసుకెళ్లాలని కోరారు.

అక్టోబర్ 2 వరకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

పెద్దపంజాణి/బైరెడ్డిపల్లె/రొంపిచెర్ల : మండలాల్లో బుధవారం నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దపంజాణి, రాయలపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు మురళీ, మాధవి, బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్, రొంపిచెర్ల పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ తెలిపారు. వారు బుధవారం పెద్దపంజాణి, రాయలపేట, బైరెడ్డిపల్లె, రొంపిచెర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. మహిళలు, పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వారు మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ సేవలు బలోపేతం చేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఇల్లు, సమాజం బాగుంటాయని తెలిపారు. అదే విధంగా మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, క్యాన్సర్, టీబీ నిర్ధారణ పరీక్షలు చేశారు.



పెద్దపంజాణి: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మాధవి

రేపు చలో మదనపల్లె మెడికల్ కాలేజ్

సోమల(చౌడేపల్లె)/పుంగనూరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం చలో మదనపల్లె మెడికల్ కాలేజ్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ హేమంత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. వారు బుధవారం సోమలలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిందని తెలిపారు. వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకునేందుకు చలో మదనపల్లె మెడికల్ కళాశాల కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అండర్ -14, 17 క్రీడా పోటీలు ప్రారంభం

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం అండర్- 14, 17 మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంఈవో సుబ్రమణ్యం పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, ఖో-ఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మనోరంజిని, దేశాయమ్మ, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ చిరంజీవి, పీడీలు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక

నదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో కబడ్డీలో ధరణీధర, మహేంద్రనాయుడు, సృజిత్ కుమార్, ఖోఖోలో తులసీరెడ్డి, వాలీబాల్‌లో వెంకటతేజశ్వ, చరణ్, రామ్‌చరణ్, అథ్లెటిక్స్‌లో మహేంద్రనాయుడు, ఆసీఫా, తులసి, జాహ్నవి, యోగశ్రీ, లిఖిత డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో పీడీలు భాస్కర్, నౌషద్ అలీ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

రొంపిచెర్ల: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని హెచ్‌ఎం ధనలక్ష్మి తెలిపారు. రొంపిచెర్ల ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. సర్పంచ్ ఇబ్రహీంఖాన్, హెచ్‌ఎంలు సుజాత, అమర్‌శేఖర్, పీఈటీలు పాల్గొన్నారు.